# రేపు బంద్

నారయ్య తూలుతూ గుడిసె తలుపు తోశాడు. కిర్రుమంటూ తలుపు తెరుచుకుంది. గాలిలో నడుస్తున్నట్లు అడుగులు వేస్తూ లోపలికి వచ్చిన నారయ్యని చూసి ఎల్లమ్మ గయ్‌మంటూ లేచింది.

“బాగా పీకిదాకా పట్టించావా! సిగ్గునేకపోతే సరి. బండి ఏసిన డబ్బులు ఏసినట్టు కర్చెడితే కూడెవడెడతాడు నీ బాబు” అని గట్టిగా అరుస్తూ కొబ్బరిడొక్కలు పొయ్యిలో కుక్కుతోంది.

“ఏహే....నోరుముయ్యే, నా యిష్టం - అయినా నేతాగా ననుకుంటున్నావా! సీ సీ ఎవరు సెప్పారు నీకు- ఉత్త అబద్ధం” అంటూ కుక్కిమంచం కేసి అడుగులు వేశాడు.

“అయ్యో, ఓరు సెప్పాలా ? నిన్ను సూస్తుంటే తెల వదూ ! ఆ ముగం చూడు ఎట్టగుందో” అంటూ పుట్టిమీద కుండదింపింది. నారయ్య మంచంమీద వెల్లకిలా పడుకుని

కష్టంగా కళ్ళు తెరిచి చూస్తున్నాడు. చిన్ని లాంతరు వెలుగులో గుడిసె మసక మసగ్గా వుంది. సన్నని చలిగాలి అప్పుడప్పుడు రివ్వున వీస్తోంది. పొయ్యిమీద బియ్యం కుతకుత లాడుతు న్నాయి. కుక్కి మంచలో పడుకున్న నారయ్య దగ్గరకి విసురుగా వెళ్ళి అతని జుబ్బా జేబులో చెయ్యిపెట్టి డబ్బులకోసం వెదక సాగింది ఎల్లమ్మ. ఆమె చేతికి ఒక పావలా తగిలింది. కోపంతో నోటికొచ్చినట్లు తిట్టసాగింది.

„సీ, మడిసికి సిగ్గూ శరం వుండాల, యింటికాడ కూడునేక పెళ్ళాం, పిల్లలు మాడిపోతుంటే బాగా తాగి, తిని తగులడితే ఏట్టాగంట ? రేపునేమో బందట. ఒక్క దుకాణం వుండదు. కుండలో ఒక్క గింజనేదు. పొయ్యిలోకి పుల్లనేదు. ఇయ్యేల నీ రిక్షా డబ్బులు తగులెట్టేశావు.”

„ఏ ఒహే నీ గొడవ. సంపుతున్నావ్. రేపటి గురించి ఈ యేళ ఎందుకు ? రేపెలా వుంటామో !”

„ఓయబ్బో ఏదాంతం ! కడుపునిండాక అందరికీ వచ్చేదే అది. పాపం పిల్లల మాటేటి.”

„ఏమో ! నాకేటి? నా యిట్టం. నా కష్టపడ్డ డబ్బులు నే కర్చెడితే నీకెందుకు.”

ఎల్లమ్మ కోపంతో వూగిపోయింది.

"అట్టాగా ! అయితే నడు బయటకి" అంటూ చెయ్యి పుచ్చుకుని లాగింది. ఆ సమయంలో బాగా తాగివున్న నారయ్యకి వొళ్ళు తెలియని కోపంవచ్చి ఎల్లమ్మ మీదపడి యిష్టం వచ్చినట్లు కొట్టాడు.

"ఓరి సచ్చినోడో" అంటూ ఎల్లమ్మ రాగాలు పెట్టడం మొదలెట్టింది. ఏదో గొణుక్కుంటూ మళ్ళీ మంచం మీద పడ్డాడు నారయ్య. బయట వెన్నెట్లో ఆడుకుంటున్న మంగి వచ్చి బిక్కుబిక్కుమంటూ ఒక పక్కగా నిలబడింది. ఎల్లమ్మ ముఖం చేతుల్లో పెట్టుకుని సన్నగా ఏడుస్తోంది. తల్లి ఏడుపు చూస్తుంటే ఆ పసి హృదయం తలడిల్లిపోయింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. ఇంతలో పదేళ్ళ వీరాయి యింట్లో అడుగుపెట్టి "అమ్మా" అని అరిచాడు సంతోషంగా - కాని అతని ఉత్సాహం చిటికెలో మాయమైంది. ఒక్కసారి తల్లిని, తండ్రిని చూసి పరిస్థితి అర్థం చేసుకున్నాడు.

"అమ్మా ! ఇయిగో డబ్బులు, యిటుసూడు రెండు రూపాయలు" అంటూ తల్లి గడ్డం పట్టుకుని పైకెత్తి నోటు చూపించాడు.

"ఏడవిరా?" అంటూ ఎల్లమ్మ అనుమానంగా చూసింది.

"అమ్మోయ్ ! అట్టా సూస్తావే నేనేమన్నా దొంగతనం సేసాననుకుంటున్నావా ? అట్టాగేం కాదు. ఇయ్యాళ

పెద్దకోమటి కొట్టుకాడ వుండి మూటలు మోశాను, సరకుల బుట్టలు మోశాను ఇన్ని డబ్బులొచ్చాయి చూడు" అంటూ మళ్ళీ నోటు చూపించాడు. ఆ తల్లి హృదయం ఒక్కసారి సంతోషంతో, జాలితో కంపించింది.

"ఎందుకురా నీ కలాంటివి ? ఈయాల్టికి సరే మరి పోబోకు" అంటూ రెండు రూపాయల కాగితం తీసుకుని సంచితో బయటకు బయలుదేరిందిబియ్యానికి. మరి రేపు బంద్ కదా అని.

o o o

పాలవెన్నెలలాంటి ట్యూబులైటు కాంతిలో ఆ గది చల్లగా వుంది. పైన ఫేను శక్తివంచన లేకుండా గిరగిర తిరుగుతోంది. నాలుగు కుర్చీల మధ్య టేబిలుమీద సీసాలు, గ్లాసులు తళతళ మెరుస్తున్నాయి. నున్నటి బల్లమీద చెదిరి అక్కడక్కడ వున్న నగిషీ పాత్రలు వెన్నెట్లో ఆడిఆడి అలసిన కన్నెపిల్లలు లాగ వున్నాయి. మూడు కుర్చీలు ఖాళీగా వున్నాయి. ఒక కుర్చీలో వెంకన్నగారు కూర్చుని మోచేతులు టేబులుమీద ఆన్చి, అరచేతులలో చెంపలు చేర్చి, మత్తుగా కళ్ళు మూసుకుని వున్నారు. రంగురంగుల స్వప్నాలు ఆయన కళ్ళముందు కదులుతున్నాయి. పెద్ద ఎత్తున గద్దెమీద కూర్చుని అందరినీ ఆజ్ఞాపిస్తూ యాజమాన్యం చేస్తున్నట్లు మనసు గర్వంతో పొంగిపోతోంది. అల్లుణ్ని ఆమెరికాకు,

ప్లేన్ ఎక్కేస్తూ వీడ్కోలు యిస్తున్నట్లు కళ్ళల్లో మెదులు తోంది. కోటేశ్వరరావు తన కొడుక్కి పిల్లనిచ్చి తనకి వంగి వంగి సలాములు చేస్తున్నట్లు వూహాలో కరగిపోతున్నాడు.

"సార్ !" భుజంగం ఏవో కాగితాలు పట్టుకుని సవిన యంగా నిలబడ్డాడు.

వెంకన్నగారు కళ్ళు తెరిచి చూశారు. ఏవిటి అన్నట్లు ఆయన ముఖం ప్రశ్నార్థకంగా వుంది.

"మీరీ విషయం చూడాలిసార్."

"ఏ విషయం" ఆయన గొంతు జీరబోయి శృతి తప్పిన సన్నాయిలా మోగింది.

"బయట చాలా గొడవగా వుంది సార్, మీరొక్క సారి విషయం పరిశీలించి మీ నిర్ణయం, మీ సహకారం తెలియ జెయ్యకపోతే సమ్మె విరమించమంటున్నారు" అన్నాడు భుజంగం.

"ఏవిటయ్యా గొడవ" ఏం కావాలిట ? ఎందుకీ గొడవ ? అంటూ విసుగ్గా తల పంకించారు. భుజంగం కాగి తాలు ఆయన ముందుంచాడు.

"అబ్బ ! యివన్నీ యిప్పుడు చూడలేనయ్యా ? బాబూ ! విషయం రెండుముక్కల్లో చెప్పు." అంటూ సెక్రటరీ భుజంగం కేసి చూశాడు. ఎర్రని ఆయన కళ్ళల్లో

లోకాన్ని దహించే అగ్ని గోచరమౌతోంది. వేలాది ప్రజలు తమ యిష్టాన్ని తెలిపి ఎన్నుకున్న సత్యం - నిజం భగ భగ మండుతున్నట్లు ఆ కళ్ళల్లో కనబడుతోంది. భుజంగం మనసు తాచుపాములా చ్రరున లేచింది. స్వార్థపరుల నిర్లక్ష్యానికి అమాయకులు ఎందరో ఆహుతి అవుతున్నారు. కాటు వేసినా విషం చిమ్మ లేని కోరలుతీసిన పాము భుజంగం. అందుకే ఆవేశాన్ని అంగిట్లో అణచి విషయం క్లుప్తంగా చెప్పాడు. వెంకన్నగారు విసుగ్గా కనుబొమలు ముడిచారు.

"ప్రతిదానికిసమ్మె సమ్మె, బందే. అట, ఇదొకటి దొరికింది. మెత్తగా తన్నేవాడులేక -, అయినా రేపు చూద్దాం - నాకివ్వాళ నిద్దరొస్తోంది అంటూ లేచి బద్ధకంగా వొళ్ళు విరుచుకుని పడక గదివేపు దారితీశారు.

పెద్ద పెద్దవారు వారి తీరిక వేళల్లో సామాన్యుల సమస్యల గురించి ఆలోచిస్తారు. వాటిని వారి హాబీలలో జమ కట్టి ఆటలు ఆడుకుంటారు. పెద్దరికాలు సంపాదించే వరకు వుండే నిజాయితీ, నిలకడ అది సంపాదించాక వుండదు. మనిషిని స్వార్థం మృగంగా మారుస్తుంది. స్వార్థపూరిత నేత్రాలకు అమాయకులు అసమర్థులుగా కనిపిస్తారు. అన్యాయాలకు, అక్రమాలకు సహితం వారు వెనుకాడరు.

అర్థరాత్రి మెలకువ వచ్చిన వెంకన్నగారు ఆ విషయం ఆలోచించారు. అది చెప్పుకోదగినంత ప్రాముఖ్యం యివ్వదగిందిగా అనిపించలేదు. మెత్తని పరుపుమీద వెల్లకిల్లా పడు

కుని తిరిగే ఫేన్ కేసి చూస్తూ ఐదు నిముషాలు దీర్ఘాలోచన చేసి. పక్కనున్న ఫోన్ తీసి ఒక నెంబరు డయల్ చేశారు. మూడు ముక్కల్లో విషయాన్ని ముచ్చటగా చెప్పారు. ఫోను పెట్టేసి మెత్తని దిండులో తలదూర్చి నిశ్చితంగా నిద్రలోకి వొరిగారు. రేపు 'బంద్' అయినా ఆయనకి ఆ విషయం పట్టించుకోవాల్సిన పనిలేదు వడ్డించిన విస్తరి ఆయన జీవితం.

* * *

కాళ్ళు అరిగేలా తిరిగాడు సుబ్బారావు ఐదు రూపాయల అప్పుకోసం. వున్న ఊరికి ఏడు మైళ్ళ దూరంలో మిల్లు గుమాస్తాగా వున్నాడు. సుబ్బారావు. ఉదయం లేస్తే అంతా బంద్. బస్సులు, రిక్షాలు, ఆటోలుఏవీ వుండవు. అతను మిల్లు చేరాలంటే కనీసం రెండు రూపాయలు వుండాలి. పైగా రోజులా మెల్లిగా భోజనం చేసి వెళ్తే కుదరదు. తెల్లవారక ముందే పరుగులు పెట్టాలి. ఎలాగోలాగ మిల్లు చేరాలి. అసలే టెంపరరీ ఉద్యోగం. అందులో ఎన్నాళ్ళో కష్టపడి, నానా అవస్థలుపడి సంపాదించినది, యజమానులకు కోపం వచ్చి అందులోంచి వూడబీకేస్తే సుబ్బారావు పిల్లలతో, పెళ్ళాంతో మలమల మాడాలి. అతనికి అప్పుకోసం తిరగడం అలవాటే. అరగటానికి అతనికి చెప్పులు లేవు అలసటకి అతని మనసు. ఎప్పుడో బండగా మారింది. సుబ్బారావు పదాతుంటే యిల్లు చేరాడు గంపెడు అలసటతో, వడ్డీకి దొరికిన పదిరూపాయల

అప్పుతో. రెండు మెతుకులు తిని పక్కమీదికి చేరేటప్పటికి పదకొండు కొట్టింది నిజాయితీగల కొట్టు గడియారం.

ఒంటిగంటకి భార్య తట్టి లేపింది.

“ఏమండీ! లేవండి. తెల్లవారితే బంద్ కదండి. పాలు దొరకవు. పాలవేను ఇప్పుడే వచ్చేసింది. త్వరగా వెళ్ళి ఒక సీసా తీసుకురండి, యిదిగో మిమ్మల్నే - లేకపోతే మన మాట ఎలావున్న పిల్లాడు గోలపెట్టేస్తాడు” అంటూ మొదలుపెట్టింది.

అర్థరాత్రి వేళ, అలసట లేదని నిద్రలో తప్పని సరిగా లేచి, షర్టు తొడుక్కుని దేశంలోని సమస్యలుగాని, రాజకీయాలు గాని అనుభవిచడమేగాని, ఆకళింపు చేసుకోవడం తెలియని సుబ్బారావు బయటకు బయలుదేరాడు. అతని లక్ష్యం ఎన్ని అవస్థలు పడి అయినా ఒక సీసా పాలు సంపాదించాలి. అదే అతని మనసునిండా వ్యాపించిన సమస్య.

o o o

తెల్లగా తెల్లవారింది. సూర్యుడు సహితం వెల వెల బోతూ ఉదయించాడు. రోడ్లన్నీ ఎడారిపాయల్లా వున్నాయి. ఒక్క కొట్టు తెరవలేదు. ఒక హోటల్ తీసిలేదు. గలగలలాడే వీధులు కళా విహీనంగా వున్నాయి. స్తంభించిన కాలం మెల్లగా కదులుతోంది. అందరి ముఖాలలో ఏదో తెలియని అశాంతి, ఆతృత, ఆవేదన తొంగి చూస్తున్నాయి. కొందరు ఆవేశంతో ఆరాటంతో కందిన ముఖాలతో అటూ యిటూ

తిరుగుతున్నారు. గుంపులుగా చేరి ఏవో చర్చలు చేస్తున్నారు. పోలీస్ వాను చూస్తే ఎక్కడికక్కడ చెల్లాచెదరై పోతున్నారు - మధ్యాహ్నం ఎండ మిటలాటలాడుతోంది. ఇనుప టోపీలతో పోలీసులు అటూ యిటూ తిరుగుతున్నారు. చేతులలో లాఠీలు పెదవులపై చిరునవ్వులు, ఇది పిల్లకి చెలగాటం, ఎలక్కి ప్రాణగండం - అంతలో ఎక్కడినుంచో కేకలు - జయ జయధ్వానాలు - నినాదాలు గుంపులు గుంపులుగా వూరేగే ఆవేశాల ఆకృతులు, అణగారే హక్కుల కోసం అడుగులు వేసే నిస్వార్థుల రూపాలు - ఏమీ తెలియని ఎందుకో అర్థంకాని అల్లరిగా అరిచే అమాయకుల ఆకారాలు -అన్నీ కదలికదలి వస్తున్నాయి. కడలివలె వుప్పొంగుతూ ఎగసి ఎగసిపడుతున్నాయి.

ఇంతలో పోలీసుల గుంపు ఒకటి జనం మీదకు దూసుకువచ్చింది. లాఠీలు టపటప లాడాయి. తుపాకీలు ధణ ధణ మ్రోగాయి. ఎన్నో హాహాకారాలు ఆక్రందనలు. అంతా అలజడి, ఎవరిని కొడుతున్నారో - ఎవర్ని కాలుస్తున్నారో తెలియని పరిస్థితి - గొడవ. పరుగులు కేకలు - అరుపులు - పోలీసుల స్వైరవిహారం. పరుగు పెట్టినవారు పారిపోయారు. నేల కొరిగినవారు వొరిగిపోయారు. గాయపడిన వారు మూలిగారు. లాఠీలు, తుపాకీలు నిలిచిపోయాయి. ఆక్రందనలు అక్కడక్కడ దూరంగా జరిగి జరిగి మాయ

మయ్యాయి. మళ్ళీ అంతా నిర్జనం. అది యుద్ధం ముగిసిన సమరభూమి.

o o o

గుడిసె దగ్గర కూర్చుని బియ్యం ఏరుకుంటున్న ఎల్లమ్మకి ఎవరో చెప్పారు.

"మీ వీరాయిని పోలీసులు కాల్చేశారట" అని. ఎల్లమ్మ నిలువునా నీరైంది. భయం దుఃఖంతో గజ గజ వణికిపోయింది. వొళ్ళు తెలియని బాధతో ఒక్క పరుగు పెట్టింది. కాల్పులు జరిగినచోట ఒక్కమనిషి జాడలేదు. ఎవరో అన్నారు హాస్పిటల్‌లో వుంచారని. అటు పరుగెట్టింది. హాస్పిటల్ గేటు దగ్గర వేలాది జనం. ఏడుపులతో కోలాహలంగా వుంది. ఎవరినీ లోపలికి రానియ్యరు. ఎవరు చని పోయారో ఎవరు గాయపడ్డాలో తెలియడం లేదు. ఎల్లమ్మ గుండెలు పగిలేలా ఏడ్చింది. హాస్పిటల్ గేటు వూచలు పట్టుకుని రెండు గంటలు ఏడ్చి ఏడ్చి, (వేలాడి సొమ్మసిల్లి పోయింది. అయినా వీరాయి జాడ తెలిసినవారు లేరు. ఏమై పోయాడో నా తండ్రి అంటూ కుప్పలా కూలిపోయింది ఎల్లమ్మ.

o o o

భయంతో బిక్కచచ్చి నీరసంగా యింటికి చేరాడు సుబ్బారావు. తలుపు తట్టాడు, ఎదురుగా నిలచిన భార్యను గట్టిగా పట్టుకుని,

"ఈ వేళ ఎంత మంచి రోజో, కొద్దిలో నా చావు తప్పింది. నా ప్రక్కగా వున్న ఒక పదేళ్ళ కుర్రాడికి తగిలింది తుపాకీ గుండు" అంటూ ఆయాసంగా కళ్ళు మూసుకున్నాడు జరిగిన దృశ్యాన్ని తలుచుకుని కంపించిపోతూ -

o o o

ప్లేటులోని ఏపిల్ ముక్కలు ఒక్కొక్కటే తింటూ పేపరు చూస్తున్నాడు ప్రజానాయకుడు వెంకన్నగారు. ఒక్కొక్క వార్త ఒక్కొక్క ఏపిల్ ముక్క ఆయనకి. ఎన్నో చావులు ఎన్నో దెబ్బలు తిన్న దేహాలు - ఎన్నో అగ్ని ప్రమాదాలు - సజీవ దహనాలు - అన్నిటికీమించి ఆ రోజు "బంద్" చాలా నిరాఘాటంగా సాగింది.

( ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక నుండి )